TGTEL/25/A4812

# వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 65 | పేజీలు : 06| వెల: రూ.3/- తెలంగాణ బుధవారం | జూన్ 17, 2026



## సర్కార్ బడుల నుంచే ఐఏఎస్, ఐపీఎస్‌లు..

- ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం నామోషీ కాదు
- సీఎం రేవంత్ రెడ్డి
- ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ప్రారంభం
- కులమతాలకు అతీతంగా నాణ్యమైన విద్యే లక్ష్యం
- ఇంటిగ్రేటెడ్ బళ్లతో కులగోడలు బద్దలుకొడతాం
- విద్యార్థులతో కలిసి అల్పాహారం తిని, ఫుట్‌బాల్ ఆడి సందడి చేసిన ముఖ్యమంత్రి

**రంగారెడ్డి,వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రభుత్వ పాఠశాలల ద్వారానే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని, సమాజంలో అసమానతలు తొలగిపోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అందడం ఎంతో అవసరమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుకుని ఐఏఎస్, ఐపీఎస్, ముఖ్యమంత్రులు, ప్రధానులైన ఎందరో మహానుభావులు ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం నామోషీ అనే అపోహ, ఆలోచనల నుండి సమాజం బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో రూ.15 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' (టిపిఎస్)ను ముఖ్యమంత్రి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్‌లోని డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, లైబ్రరీ, ల్యాబ్‌లు, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థుల పక్కన కూర్చుని వారితో కలిసి అల్పాహారం స్వీకరించారు. స్కూల్ మైదానంలో విద్యార్థులతో కలిసి కాసేపు సరదాగా ఫుట్‌బాల్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. ఆ తర్వాత ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. "ఆరుట్లలో నిర్మించిన ఈ తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఒక పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని కార్పొరేట్ స్థాయికి దీటుగా ఉచిత విద్యను అందించేలా నిర్మించాం. ఇప్పటికే ఇక్కడ 1,814 మంది విద్యార్థులు చేరారు. అడ్మిషన్ల కోసం భారీగా దరఖాస్తులు రావడంతో 'సీట్లు లేవు' అని బోర్డు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ విజయానికి కారణమైన ఇక్కడి ఉపాధ్యాయుల కృషి రాష్ట్రానికే ఆదర్శం. ఈ విద్యా నమూనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 నుండి 27 లక్షల మంది విద్యార్థులకు కొత్త స్ఫూర్తినిస్తుంది." (మిగతాది 2వ పేజీలో..)

## రూ. 2వేల కోట్ల బడ్జెట్ లేని శాఖలో అంత స్కామ్ ఎలా సాధ్యం?

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆధారాలు లేకుండా మాట్లాడటం హరీశ్‌రావుకు తగదు
- ఆరోపణలు నిరూపిస్తే ప్రభుత్వం దేనికైనా సిద్ధం




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ గురుకుల పాఠశాలల టెండర్లలో రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్‌రావు వ్యాఖ్యలను పూర్తిగా కొట్టిపారేశారు. సంక్షేమ శాఖల్లో మొత్తం టెండర్ల విలువే రూ. 2 వేల కోట్లు లేనప్పుడు, అంత మొత్తంలో స్కామ్ జరిగిందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఆధారాలు లేకుండా బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న శాఖలపై బురదజల్లడం సరికాదని హితవు పలికారు. హరీశ్‌రావు చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని, వాటిని నిరూపిస్తే ప్రభుత్వం దేనికైనా సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇలాంటి నిరాధార ఆరోపణలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

## శుభ ముహూర్తాలు షురూ..

మోగనున్న పెళ్లి బాజాలు!

నిజ జ్యేష్ఠ మాసం ప్రవేశంతో తెలుగు లోగిళ్లలో సందడి

జూలై 9 వరకే పరిమిత ముహూర్తాలు..

ఆపై ఆషాఢం, మూఢాల బ్రేక్

పశ్చిమాసియా యుద్ధ ప్రభావం..

పెళ్లి పెద్దలకు తప్పని బడ్జెట్ వాత!







## అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడికి కుట్ర భగ్నం

- వైట్‌హౌస్‌పై డ్రోన్లు, స్నైపర్లతో దాడులకు దుండగుల వ్యూహం
- ముందే పసిగట్టి అడ్డుకున్న ఎఫ్‌బీఐ
- ఉగ్ర కుట్ర కేసులో ఐదుగురు నిందితుల అరెస్ట్

## రాష్ట్రంలో దండుపాళ్యం రాక్షస పాలన

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ కేసీఆరే సీఎం
- ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా అభివృద్ధి సున్నా
- 'ఎస్ఐఆర్'పై బీఆర్ఎస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి



వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
బుధవారం, జూన్ 17, 2026

# అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడికి కుట్ర భగ్నం

- వైట్‌హౌస్‌పై డ్రోన్లు, స్నైపర్లతో దాడులకు దుండగుల వ్యూహం
- ముందే పసిగట్టి అడ్డుకున్న ఎఫ్‌బీఐ
- ఉగ్ర కుట్ర కేసులో ఐదుగురు నిందితుల అరెస్ట్

**వాషింగ్టన్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అమెరికా అధికారిక అధ్యక్ష భవనం 'వైట్‌హౌస్'పై భారీ ఎత్తున ఉగ్రదాడి జరిపేందుకు కొందరు దుండగులు పన్నిన భయంకరమైన కుట్రను అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ విజయవంతంగా భగ్నం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 80వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా వైట్‌హౌస్‌లో నిర్వహించిన యూఎఫ్‌సీ ఈవెంట్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడికి వ్యూహం రచించినట్లు అధికారులు గుర్తించారు. ఈ ముఠా డ్రోన్లు, స్నైపర్ గన్లతో దాడులు జరిపి పెద్ద ఎత్తున రక్తపాతం సృష్టించాలని ప్రణాళిక వేసుకోగా, ఎఫ్‌బీఐ రంగంలోకి దిగి ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసింది. ఈ భారీ ఉగ్ర కుట్ర వెలుగుచూడటంలో ఒక తల్లి చూపిన సమయస్ఫూర్తి అత్యంత కీలకంగా మారింది. నిందితుల్లో ఒకరైన 19 ఏళ్ల టైసెన్ ప్రాపర్ అనే యువకుడి తల్లి.. తన కుమారుడి ప్రవర్తనపై అనుమానం పెంచుకుంది. అతడు గూఢచర్యం, భారీగా విదేశీ ఆయుధాలు కొనుగోలు చేయడం, 'హిట్ అండ్ రన్' మిషన్ల గురించి ఫోన్లలో కొందరితో రహస్యంగా మాట్లాడుతుండటాన్ని ఆమె గమనించింది. కుమారుడని వెనకేసుకురాకుండా, దేశ భద్రతను కాంక్షిస్తూ ఆమె వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించింది. దీంతో రంగంలోకి దిగిన ఎఫ్‌బీఐ శరవేగంగా దర్యాప్తు చేపట్టి ముఠా గుట్టు రట్టు చేసింది. ఎఫ్‌బీఐ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నిందితులు అత్యంత ప్రమాదకరమైన ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. పేలుడు పదార్థాలు అమర్చిన అత్యాధునిక డ్రోన్లతో వైట్‌హౌస్ సమీపంలోని భవనాలపై ముందుగా దాడులు చేయాలని నిశ్చయించుకున్నారు. తద్వారా అక్కడ తీవ్ర భయాందోళనలు సృష్టించి, ప్రాణాలు కాపాడుకోవడానికి భవనాల నుండి బయటకు పరుగులు తీసే సాధారణ ప్రజలపై చుట్టుపక్కల భవనాలపై పొంచి ఉండే స్నైపర్లతో కాల్పులు జరిపి భారీ ప్రాణనష్టం కలిగించాలని వ్యూహం రచించారు.

# సర్కార్ బడుల నుంచే ఐఏఎస్, ఐపీఎస్‌లు..

- ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం నామోషీ కాదు
- సీఎం రేవంత్ రెడ్డి
- ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ప్రారంభం
- కులమతాలకు అతీతంగా నాణ్యమైన విద్యే లక్ష్యం
- ఇంటిగ్రేటెడ్ బళ్లతో కులగోడలు బద్దలుకొడతాం
- విద్యార్థులతో కలిసి అల్పాహారం తిని, ఫుట్‌బాల్ ఆడి సందడి చేసిన ముఖ్యమంత్రి

(మొదటి పేజీ తర్వాత..) "డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పినట్లు 'దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే నిర్మితమవుతుంది'. విద్య ద్వారానే సమాజంలో సంపూర్ణ మార్పు సాధ్యం. అందుకే విద్యను మేము ఖర్చుగా భావించడం లేదు, భవిష్యత్తు తరాలపై పెడుతున్న పెట్టుబడిగా చూస్తున్నాం. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్‌ను వేశాం. వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలను సందర్శించి ఆ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగానే ఈ కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తున్నాం." "గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను మరింత ప్రోత్సహించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టి సమాజంలో కులాల మధ్య గోడలు నిర్మించారు. ఆ గోడలను కూల్చాలనే ఉద్దేశంతోనే, అన్ని వర్గాల పిల్లలు ఒకేచోట కలిసి చదువుకునేలా మేము 'ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' నిర్మిస్తున్నాం. గతంలో ఇచ్చిన యూనిఫామ్‌లు నెల రోజులకే చిరిగిపోయాయి. కానీ మా ప్రభుత్వం రూ.680 కోట్లతో అత్యంత నాణ్యమైన వస్తువులతో కూడిన విద్యా కిట్లను అందిస్తోంది. దీనిపై కూడా కొందరు అవినీతి ఆరోపణలు చేయడం హాస్యాస్పదం." "140 కోట్ల జనాభా ఉన్న మన దేశం ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోతోంది. ఇటీవల నేను దక్షిణ కొరియాను సందర్శించి అక్కడి క్రీడా విధానాలను అధ్యయనం చేశాను. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుంటే కొందరు రాజకీయ స్వార్థంతో విమర్శలు చేస్తున్నారు. మెస్సీ ఏమైనా డ్రగ్స్ ముఠా లీడరా? లేదా ఆర్థిక నేరగాడా? యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకే త్వరలోనే రాష్ట్రంలో 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ప్రారంభిస్తాం. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే క్రీడాకారులను తయారుచేయడమే మా లక్ష్యం." రాష్ట్ర యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 19న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో గౌరవ గవర్నర్ సమక్షంలో డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నాం." అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రతిష్టాత్మక విద్యా కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.






# శుభముహూర్తాలు షురూ..

- మోగనున్న పెళ్లి బాజాలు!
- నిజ జ్యేష్ఠ మాసం ప్రవేశంతో తెలుగు లోగిళ్లలో సందడి
- జూలై 9 వరకే పరిమిత ముహూర్తాలు..
- ఆపై ఆషాఢం, మూఢాల బ్రేక్
- పశ్చిమాసియా యుద్ధ ప్రభావం..
- పెళ్లి పెద్దలకు తప్పని బడ్జెట్ వాత!

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలుగు లోగిళ్లల్లో పెళ్లి బాజాల సందడి మళ్లీ మొదలైంది. గత నెలన్నర రోజులుగా అధిక జ్యేష్ఠ మాసం కారణంగా నిలిచిపోయిన శుభకార్యాల హడావుడి ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. జూన్ 15 నుంచి నిజ జ్యేష్ఠ మాసం ప్రవేశించడంతో పెళ్లిళ్ల సందడి షురూ అయ్యింది. జూన్ 18 నుంచి జూలై 9 వరకు మాత్రమే పరిమితంగా శుభ ముహూర్తాలు అందుబాటులో ఉన్నాయి. ఆ తర్వాత మళ్లీ జూలై 15 నుంచి ఆషాఢమాసం, గురుమూఢం ప్రారంభం కానుండటంతో ఆగస్టు 15 వరకు శుభకార్యాలకు బ్రేక్ పడనుంది. తిరిగి శ్రావణ మాసం వస్తేనే గానీ ముహూర్తాలు ఉండవు. దీంతో ఈ తక్కువ వ్యవధిలోనే పెళ్లిళ్లు కానిచ్చేయాలని అందరూ ఒకేసారి ప్రయత్నిస్తుండటంతో మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. సమయం తక్కువగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని పురోహితులు, ఫంక్షన్ హాళ్ల యజమానులు, డెకరేటర్లు రేట్లు పెంచేస్తున్నారు. ఈ పెళ్లిళ్ల సంతోషాల వెనుక వధూవరుల తల్లిదండ్రులకు భారీ బడ్జెట్ సవాల్ ఎదురవుతోంది. అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం తెలుగు లోగిళ్ల పెళ్లిళ్లపై గట్టిగానే పడుతోంది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగి, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు హెచ్చడంతో రవాణా ఖర్చులు, వాహనాల కిరాయిలు భారీగా పెరిగాయి. మరోవైపు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరల పెరుగుదలను సాకుగా చూపిస్తూ క్యాటరింగ్ నిర్వాహకులు ప్లేటు ధరలను పెంచేశారు. సమాజంలో హోదా కోసం కనీసం 25 రకాల వంటకాలతో విందు వడ్డించడం రివాజుగా మారడంతో, ఇప్పుడు ప్లేటు ధర కనీసం రూ. 500 దాటుతోంది. వీటన్నింటికీ మించి మధ్యతరగతి, పేద కుటుంబాలకు పెళ్లిలో అత్యంత కీలకమైన బంగారం కొనుగోలు పెద్ద భారంగా మారింది. సంప్రదాయం ప్రకారం మంగళసూత్రాలు, గొలుసు, కమ్మలు, గాజులు వంటి కనీస అవసరాల కోసమే 5 నుండి 6 తులాలు కొనాల్సి వస్తోంది. ఏడాది క్రితంతో పోలిస్తే పసిడి ధరలు విపరీతంగా పెరగడం వల్ల, కేవలం బంగారం కొనుగోలుకే ఇప్పుడు రూ. 7 లక్షల నుండి రూ. 8 లక్షలు ఖర్చవుతోంది. బంగారం ఖర్చు కాకుండా.. మండపం అద్దె, విద్యుత్ అలంకరణ, విందు భోజనాలు, బట్టలు, ప్రయాణాలకే అదనంగా మరో రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు ఖర్చవుతోంది. అంతర్జాతీయ పరిస్థితులు మారకముందుతో పోలిస్తే, ప్రస్తుతం ఒక్కో పెళ్లికి సగటున రూ. 5 లక్షల వరకు అదనపు భారం పడుతోంది. మొత్తానికి, సుదీర్ఘ విరామం తర్వాత పెళ్లి బాజాలు మోగుతున్నాయని సంతోషపడాలో.. లేక ఆకాశాన్నంటుతున్న ఖర్చుల మోత చూసి ఆందోళన చెందాలో తెలియక వధూవరుల తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.

# రాష్ట్రంలో దండుపాళ్యం రాక్షస పాలన

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ కేసీఆరే సీఎం
- ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా అభివృద్ధి సున్నా
- 'ఎస్ఐఆర్'పై బీఆర్ఎస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి



**ఖమ్మం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంక్షేమం పూర్తిగా కుంటుపడిందని, ఎక్కడ చూసినా కూల్చివేతలు, సంక్షోభాలే కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో ప్రస్తుతం రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో బుధవారం నిర్వహించిన బూత్ లెవెల్ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "రాష్ట్రంలో దండుపాళ్యం ముఠా తరహా పాలన నడుస్తోంది. ఈ ముఠాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షుడైతే, ఇక్కడి మంత్రులు ఆయనను మించిపోయారు. ఖమ్మం జిల్లా నుండి ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లాకు ఒరిగింది ఏమీ లేదు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారు. ఆర్థిక మంత్రి రాష్ట్ర ఖజానాను అస్తవ్యస్తం చేశారు" అని ఆరోపించారు. ఈ సందర్భంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వ్యతిరేకంగా ఉన్న కొన్ని వీడియో దృశ్యాలను సభా వేదికపై ప్రదర్శించారు. గత ప్రభుత్వంపై వస్తున్న అప్పుల ఆరోపణలను కేటీఆర్ తిప్పికొట్టారు. కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ తెచ్చారని, ఆయన చేసిన అప్పులన్నీ కాళేశ్వరం, భక్త రామదాసు ప్రాజెక్టులు, మెడికల్, నర్సింగ్ కళాశాలల నిర్మాణం వంటి ప్రజా సంక్షేమం కోసమేనని స్పష్టం చేశారు. ఆ అభివృద్ధికి రాష్ట్రంలో జరిగిన ప్రగతే సజీవ సాక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొద్ది కాలంలోనే లక్షల కోట్లు అప్పులు చేసి ఏం అభివృద్ధి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ ఇప్పుడైనా 100 సీట్లతో గెలుస్తారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 25 వరకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టబోయే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియపై ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్, కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. అర్హులైన బీఆర్ఎస్ సానుభూతిపరుల ఓట్లను అక్రమంగా తొలగించకుండా జాగ్రత్త వహించాలని, డిజిటల్ సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలకంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ అంతర్గత భేటీలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజురవిచంద్ర, ఎమ్మెల్యేలు తక్కలపల్లి రవీందర్ రావు, తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, రెడ్యానాయక్, లింగాల కమల్ రాజ్, పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ రౌండర్

# అంబాల ప్రభాకర్



- విలక్షణ వ్యక్తిత్వం.. బహుముఖ ప్రజ్ఞాశాలి..
- చిత్రకళ, జర్నలిజం, సామాజిక సేవ, క్రీడారంగాల్లో ప్రతిభ
- డప్ప వరల్డ్ గిన్నిస్ బుక్ రికార్డ్ సృష్టికర్త..
- తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర

ఆయన చేతిలో బ్రష్ పడితే అద్భుత చిత్రాలు ప్రాణం పోసుకుంటాయి.. సమాజం వైపు కలం తిప్పితే అక్షరాలు ప్రజా గొంతుకలవుతాయి.. ఆటమైదానంలో అడుగుపెడితే పతకాలు దాసోహమంటాయి.. నిరుపేదలకు అండగా నిలిస్తే సేవాభావం పరిమళిస్తుంది. ఆయనే ఆర్టిస్ట్ నుంచి ఆల్ రౌండర్ గా, జర్నలిస్ట్ ఉద్యమకారుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు). కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్, ఒక సాధారణ కుటుంబం నుంచి ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో అంతర్జాతీయ, జాతీయ స్థాయి గుర్తింపు సాధించిన ప్రస్థానం నేటి యువతకు ఆదర్శప్రాయం.

**జమ్మికుంట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :**

### ప్రపంచ గిన్నిస్ రికార్డ్ సృష్టికర్త..

కళలను, కళాకారులను గౌరవించడంలో ప్రభాకర్ ఎప్పుడూ ముందే ఉంటారు. 2019లో హుజురాబాద్ కళారవళి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏకంగా 1200 మంది డప్పు కళాకారులను ఒకే వేదికపైకి తెచ్చి, భారీ ప్రదర్శనతో 'ప్రపంచ గిన్నిస్ బుక్ రికార్డ్' సృష్టించారు. నాటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుని ఘన సన్మానం పొందారు.



డప్పు గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ - 2019.

### గురుకులాల నుంచి ..

అంబాల మధునమ్మ, కీ.శే.రాములు దంపతుల కుమారుడైన ప్రభాకర్ ప్రాథమిక విద్యను మడిపల్లిలో పూర్తి చేశారు. ఆ తర్వాత 5 నుంచి ఇంటర్మీడియట్ వరకు (1989-1997) మేడిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో చదివారు. అప్పటి ప్రిన్సిపాళ్లు సురేందర్, నరసింహారెడ్డి, కృష్ణారావులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు కీ.శే. ఎం.ఆర్ ఖాన్, నిరంజన్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు అశోక్, నరసింహాచారి, భద్రాద్రిల ప్రోత్సాహం ఆయనను బహుముఖ ప్రజ్ఞాశాలిగా తీర్చిదిద్దింది. చదువుతో పాటు జాతీయ క్రీడాకారుడిగా, జానపద కళాకారుడిగా, విద్యార్థి నాయకుడిగా ఎదిగిన ప్రభాకర్, 1998లో హైదరాబాద్‌లోని ప్రముఖ జవహార్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలో ఫైన్ ఆర్ట్స్ సీటు సాధించి తన ప్రతిభను చాటుకున్నారు.

### 'ప్రభు ఆర్ట్స్' సంచలనాలు..

1999లో జమ్మికుంట కేంద్రంగా 'ప్రభు ఆర్ట్స్' పేరుతో కమర్షియల్ ఆర్టిస్ట్‌గా సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆయన గీసిన అద్భుతమైన చిత్రాలు, ఆయిల్ పెయింటింగ్స్ సామాన్య ప్రజల నుంచి మొదలుకొని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల వరకు అందరి మన్ననలు పొందాయి. కళారంగంలో ఆయన చూపిన ప్రతిభకు గానూ 2022లో అంజలి ప్రొడక్షన్ ఆధ్వర్యంలో 'నంది అవార్డు'ను ప్రస్తుత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే 2023లో ఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ వారి 'జాతీయ కళారత్న అవార్డు'ను కైవసం చేసుకున్నారు.


### సమరశీల జర్నలిజం..

1999 డిసెంబర్ 24న జమ్మికుంటలో 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' పత్రిక ద్వారా విలేకరిగా జర్నలిజం ప్రయాణం ప్రారంభించిన ప్రభాకర్, ఆ తర్వాత పలు ప్రధాన పత్రికలు, ప్రముఖ టీవీ ఛానళ్లలో పనిచేశారు. తెలంగాణ ఉద్యమ కాలంలో సీనియర్ జర్నలిస్ట్ అల్లం నారాయణ నేతృత్వంలోని 'తెలంగాణ జర్నలిస్టు ఫోరం'లో క్రియాశీలక పాత్ర పోషించి, జర్నలిస్టులను ఏకం చేసి స్వరాష్ట్ర సాధన కోసం పోరాడారు. జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం శ్రమిస్తూ.. అధికారులతో, రాజకీయ నాయకులతో సమన్వయం చేసుకుంటూ జర్నలిస్టుల హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్లు, ఇండ్ల స్థలాల సాధనలో ప్రధాన భూమిక పోషించారు. 2014 నుంచి 2025 వరకు ఇండిపెండెంట్ జర్నలిస్ట్‌గా ఆయన సేవలు కొనసాగాయి.

### 'పే బ్యాక్ టు ది సొసైటీ'..

డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ స్థాపించిన 'స్వేరోస్ నెట్వర్క్'లో 2014 నుంచి చురుగ్గా పనిచేస్తున్న ప్రభాకర్, వందలాది మంది నిరుపేద విద్యార్థులను గురుకుల విద్యాలయాల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేశారు. "సమాజం నుంచి మనం తీసుకున్నదానిని తిరిగి సమాజానికి ఇవ్వాలి" అనే 'బ్యాక్ టు ది సొసైటీ' నినాదంతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. దీనికి గుర్తింపుగా 2019లో రవీంద్రభారతిలో బి.ఎస్.రాములు చేతుల మీదుగా 'దళిత రత్న అవార్డు'ను అందుకున్నారు. ఒకవైపు సామాజిక సేవ చేస్తూనే.. మరోవైపు 'మాస్టర్స్ అథ్లెటిక్స్'లో ప్రతి ఏటా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తూ క్రీడారంగంలోనూ రాణిస్తున్నారు. నిరంతర కృషితో, పట్టుదలతో తలపెట్టిన ప్రతి రంగంలోనూ అగ్రగామిగా నిలుస్తూ, పుట్టిన గడ్డకు కీర్తి తెస్తున్న డాక్టర్ అంబాల ప్రభాకర్ ప్రస్థానం అభినందనీయం.







వాయిస్ ఆఫ్ వందే భారత్ Voice of Vande Bharath

VOICE OF VANDE BHARATH

బుధవారం, జూన్ 17, 2026

# ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలపై తనిఖీలు చేపట్టాలి

## విద్యార్థి సంఘం నేత డ్యాగ అనిల్ కుమార్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంల విక్రయాలపై తక్షణమే అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల విద్యాశాఖాధికారికి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డ్యాగ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. అచ్చంపేట మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని పాఠశాలల ప్రాంగణాల్లోనే విక్రయిస్తూ, తల్లిదండ్రులు అక్కడే కొనుగోలు చేయాలంటూ బలవంతం చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో చాలా తక్కువ ధరలకు లభించే పుస్తకాలను, పాఠశాలల పేర్లు ముద్రించి భారీ ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారని మండిపడ్డారు. విద్యను సేవగా కాకుండా పక్కా వ్యాపారంగా మార్చేసి, పాఠశాలల్లోనే ఈ రకమైన విక్రయాలు జరపడం విద్యాశాఖ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును అడ్డుపెట్టుకుని, అమాయక తల్లిదండ్రులను నిలువునా దోచుకోవడం అత్యంత ఖండనీయమైన విషయమన్నారు.విద్యాశాఖ అధికారులు స్పందించి సదరు పాఠశాలలపై వెంటనే ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, పాఠశాలల పేరుతో జరుగుతున్న విక్రయాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సదరు విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు, యాజమాన్యాలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం తరపున డిమాండ్ చేశారు.

# కొండనాగుల డిగ్రీ విద్యార్థులకు హాస్టల్ ఏర్పాటు చేయాలి

## సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



**బల్మూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండలంలోని కొండనాగుల గ్రామంలో ఉన్న శ్రీ ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వెంటనే హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరుతూ కళాశాల యాజమాన్య ప్రతినిధులు స్థానిక అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు హాస్టల్ వసతి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎంతో దూర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి చదువుకుంటున్న పేద విద్యార్థులు వసతి లేక నిత్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కళాశాల ఆవరణలోనే ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కోరారు. కళాశాల ప్రతినిధుల వినతిపై ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సానుకూలంగా స్పందించారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, కొండనాగులలో డిగ్రీ విద్యార్థుల కొరకు హాస్టల్ మంజూరయ్యేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి, విద్యా సంస్థల బలోపేతానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దేశ్యనాయక్
- ఈ నెల 20న 'చలో మహబూబ్‌నగర్'
- బహిరంగ సభకు ముఖ్య అతిథిగా త్రిపుర మాజీ సీఎం
- నడింపల్లిలో గోడపత్రికల విడుదల



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేశ్యనాయక్ పిలుపునిచ్చారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని నడింపల్లి గ్రామంలో కార్మికులు, రైతులతో కలిసి మహాసభల గోడపత్రికలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా దేశ్యనాయక్ మాట్లాడుతూ.. ఈ నెల 20, 21, 22 తేదీలలో మహబూబ్‌నగర్ పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్నాయని వెల్లడించారు. మహాసభల ప్రారంభ రోజైన జూన్ 20న మహబూబ్‌నగర్ టౌన్‌హాల్ నుంచి భారీ ప్రదర్శన నిర్వహిస్తామని, అనంతరం జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్య సర్కార్, గౌరవ అతిథులుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఎంపీ శివదాసన్, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కాగా, 21, 22 తేదీల్లో జరిగే ప్రతినిధుల సభకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 1,000 మంది ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తేసేందుకు కుట్ర చేస్తోందని దేశ్యనాయక్ తీవ్రంగా విమర్శించారు. కొత్త నిబంధనల పేరుతో కేంద్రం ఇచ్చే 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించిందని, మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలనే కొర్రీలు పెట్టడం దుర్మార్గమన్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో కూలీలకు పనిదినాలు కల్పించడంలో కేంద్రం పూర్తిగా విఫలం కాబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు తక్షణమే అమలు చేయాలి. రేషన్ షాపుల ద్వారా పేదలందరికీ 14 రకాల నిత్యవసర సరుకులను సరఫరా చేయాలి.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ టౌన్ కార్యదర్శి రాములు, రైతు సంఘం నాయకులు, అడ్వకేట్ మల్లేష్, రాములు, రాజు, కార్మికులు నాగయ్య, బక్కయ్య, రేణయ్య, లక్ష్మయ్య, లక్ష్మి, బక్కమ్మ, రేణుక, నాగమ్మ పాల్గొన్నారు.

# దుబాయ్ జైల్లో చిక్కుకున్న టెక్కీకి విముక్తి

- స్వదేశానికి రప్పించిన 'సీఎం ప్రవాసి ప్రజావాణి'
- మంత్రిమండలి, అధికారుల చొరవతో హైదరాబాద్ యువకుడు క్షేమంగా రాక
- ప్రజా భవన్‌లో చిన్నారెడ్డి, భీంరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు అభిషేక్




**అచ్చంపేట,0 వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఉపాధి కోసం వెళ్లి దుబాయ్ డిపోర్టేషన్ సెంటర్ లో చిక్కుకుని నరకయాతన అనుభవించిన రంగారెడ్డి జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు 'సీఎం ప్రవాసి ప్రజావాణి' చొరవతో విముక్తి లభించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో హైదరాబాద్ ఓల్డ్ ఆల్వాల్‌కు చెందిన టెక్కీ అభిషేక్ క్షేమంగా స్వదేశానికి చేరుకున్నారు. కష్టకాలంలో తనకు అండగా నిలిచి, సురక్షితంగా భారతదేశానికి వచ్చేలా సహకరించినందుకు కృతజ్ఞతగా బాధితుడు అభిషేక్ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డా. జి.చిన్నారెడ్డితో పాటు సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి, ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ ఛైర్మన్ ఎం. భీంరెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించి తన కృతజ్ఞతలు తెలియజేశారు. గల్ఫ్ దేశాలతో పాటు ఇతర విదేశాల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న తెలంగాణ కార్మికులు, నిరుద్యోగులను ఆదుకోవడంలో 'సీఎం ప్రవాసి ప్రజావాణి' విభాగం కీలక పాత్ర పోషిస్తోందని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరినీ సురక్షితంగా రప్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజావాణి ఇన్‌చార్జ్ డా.జి.చిన్నారెడ్డి, ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ ఛైర్మన్ ఎం.భీంరెడ్డి, రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు మాదిగ
- రాయిచేడు గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక
- జూలై 7న మాదిగ జాతి పండుగను విజయవంతం చేయండి



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** 'గో టు విలేజ్' కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని రాయిచేడు గ్రామంలో మాదిగ ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడెల్లి ఆంజనేయులు మాదిగ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశంలో.. గ్రామానికి చెందిన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎడెల్లి ఆంజనేయులు మాదిగ మాట్లాడుతూ.. మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ చదువుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తల్లిదండ్రులు తగిన ప్రోత్సాహం అందించాలని కోరారు. అదేవిధంగా, రానున్న జూలై 7వ తేదీన 'మాదిగ జాతి పండుగ' సందర్భంగా నిర్వహించే ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం సర్వసభ్య సంప్రదింపులతో రాయిచేడు గ్రామ నూతన కమిటీని ప్రకటించారు. గ్రామ అధ్యక్షుడిగా ఎత్తపు వెంకటయ్య మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా ఎత్తపు మల్లయ్య, ఇంజమూరి బాలరాజు, ఉపాధ్యక్షులుగావగ్గు లక్ష్మయ్య, ఇంజమూరి చిన్న రాములు, అధికార ప్రతినిధిగా ఇంజమూరి రాములు, కార్యదర్శులుగా ఇంజమూరి చిన్న సాయిలు, సిద్ధయ్యలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మాదిగ సంఘం పెద్దలు, యువకులు, మహిళలు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
బుధవారం, జూన్ 17, 2026

# వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం స్ఫూర్తిదాయకం

- వేములవాడ ప్రభుత్వ పాఠశాలలో లక్ష్మీబాయి వర్ధంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు
- ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆంగ్లేయుల గుండెల్లో నిద్రపోయి, మాతృభూమి విముక్తికై వీరోచితంగా పోరాడిన ధీరవనిత ఝాన్సీ రాణి లక్ష్మీబాయి అని వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ కొనియాడారు. ఝాన్సీ రాణి లక్ష్మీబాయి వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తన చివరి శ్వాస వరకు "నా ఝాన్సీని ఇచ్చేదే లేదు" అంటూ తెల్లదొరలను గడగడలాడించిన వీరనారి లక్ష్మీబాయి అని కొనియాడారు. లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక అని, ఆమె 1828 నవంబరు 19న వారణాసిలోని ఒక మరాఠా కుటుంబంలో భాగీరథి బాయి, మోరోపంత్ తాంబేకు జన్మించారని ఆయన గుర్తుచేశారు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన ఆమె.. తండ్రి సంరక్షణలో బిథూర్‌లో పెరుగుతూ గుర్రపు స్వారీ, కత్తిసాము, విలువిద్యలో అద్భుతమైన శిక్షణ పొందిందని తెలిపారు. 1842లో ఝాన్సీ రాజా గంగాధర్ రావు నెవెల్కర్‌తో వివాహం జరిగిన తర్వాత ఆమె పేరు 'లక్ష్మీబాయి'గా మారిందన్నారు. వారికి జన్మించిన మగబిడ్డ చిన్నతనంలోనే చనిపోవడంతో, గంగాధర్ రావు తన బంధువుల అబ్బాయి అయిన దామోదర్ రావును దత్తత తీసుకున్నారని లక్ష్మీనారాయణ వివరించారు. అయితే 1853లో రాజా గంగాధర్ రావు మరణించగా.. అప్పటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ లార్డ్ డల్హౌసీ ప్రవేశపెట్టిన 'రాజ్య సంక్రమణ సిద్ధాంతం' ప్రకారం ఝాన్సీని బ్రిటిష్ రాజ్యంలో విలీనం చేసుకోవాలని కుట్ర పన్నారని మండిపడ్డారు. దత్తపుత్రుడికి రాజ్యాధికారం ఇవ్వాలని లక్ష్మీబాయి చేసిన



విజ్ఞప్తిని బ్రిటిషర్లు తిరస్కరించడంతో ఆమె స్వయంగా సైన్యాన్ని నడిపి 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆంగ్లేయులపై భీకరమైన పోరాటం చేశారని గుర్తుచేశారు. మగపురుషుడి వేషధారణలో, వీపుకు చంటిబిడ్డను కట్టుకుని గుర్రంపై స్వారీ చేస్తూ లక్ష్మీబాయి చేసిన యుద్ధం ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తిని రగిలిస్తుందని, 1858 జూన్ 17న గ్వాలియర్ యుద్ధంలో ఆమె వీరమరణం పొందారని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సౌందర్య, సూపర్‌వైజర్ అంజమ్మ, ఉపాధ్యాయులు దుర్వేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాళ్లు లిక్కిడి మంజుల, పులి శారద, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# స్కూల్‌లో సామూహిక అక్షరాభ్యాసం

- పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ
- చిన్నారులకు అక్షరాలు దిద్దించి విద్యాభ్యాసానికి శుభారంభం
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలి
- కొండనాగుల ప్రభుత్వ పాఠశాలలో వేడుక



**బల్మూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండలంలోని కొండనాగుల గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు స్థానిక అచ్చంపేట నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలలో కొత్తగా చేరుతున్న చిన్నారు ఒడిలో కూర్చోబెట్టుకుని, పలకలపై అక్షరాలు దిద్దించి వారి విద్యాభ్యాసానికి వైభవంగా శుభారంభం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుకోవాలని, భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యా రంగానికి, పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యా వసతులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కాట్రాజ్ పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# త్వరలోనే మలిదశ ఉద్యమకారుల సమావేశం

- రాజకీయాలకతీతంగా నూతన కమిటీ ఎన్నిక
- అనునిత్యం పోరాడిన వారికే గుర్తింపు
- టీజేఏసీ చైర్మన్ కాశన్న యాదవ్

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని మలిదశ తెలంగాణ ఉద్యమకారుల ప్రత్యేక సమావేశాన్ని అతి త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నియోజకవర్గ చైర్మన్ కాశన్న యాదవ్, మలిదశ ఉద్యమకారుడు, మీడియా ఇన్‌చార్జ్ మహబూబ్ అలీ సంయుక్తంగా వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల త్యాగాలు, సకల జనుల సమ్మెలు, అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, కళాకారులు మరియు ఆర్టీసీ కార్మికుల సుదీర్ఘ శ్రమ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని గుర్తుచేశారు. అయితే, గత టీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారుల శ్రమను, కష్టాన్ని పూర్తిగా మర్చిపోయిందని, ఏనాడూ వారిని కనీసం సంప్రదించలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులను గుర్తించేందుకు సీనియర్ నాయకులు కే. కేశవరావు నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇదే క్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఇప్పటికే రెండు దఫాలుగా నియోజకవర్గ ఉద్యమకారులను గుర్తించి, వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేయడం



అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఉద్యమకారుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. "తెలంగాణ ఉద్యమ సమయంలో కేవలం ఒక్కరోజు వచ్చి మద్దతు తెలిపి వెళ్లిన వారిని ఉద్యమకారులుగా పరిగణించలేము. జైలు జీవితం గడిపి, అనునిత్యం లాఠీ దెబ్బలు తింటూ పోరాటాల్లో పాల్గొన్న వారినే అసలైన ఉద్యమకారులుగా గుర్తిస్తాం" అని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో రాజకీయాలకతీతంగా నియోజకవర్గంలోని అన్ని పార్టీలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, కళాకారులు, ఆర్టీసీ కార్మికులతో కలిసి అచ్చంపేటలో భారీ సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో అందరి సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియకు నియోజకవర్గంలోని ప్రతి ఒక్క ఉద్యమకారుడు సహకరించి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# 1894 రోజులుగా పేదల ఆకలి తీరుస్తున్న 'మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్'

రాజన్న సన్నిధిలో నిరంతరాయంగా అన్నదాన సేవలు




**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "అన్నపూర్ణే! సదాపూర్ణే! శంకర ప్రాణ వల్లభే! జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహీచ పార్వతి..." అనే దివ్య సంకల్పంతో 'మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్' గత 1894 రోజులుగా నిరంతరాయంగా నిర్వహిస్తున్న అన్నదాన మహోత్సవం బుధవారం కూడా అత్యంత శ్రద్ధతో కొనసాగింది. దాతల ఉదార నిధుల సహకారంతో స్థానిక లక్ష్మీ గణపతి రాజన్న భీమేశ్వర ఆలయ ప్రాంగణంలో పేదలకు, అన్నార్తులకు ట్రస్టు ప్రతినిధులు తృప్తిగా అన్నదానం చేశారు. భోజనంతో పాటు వారికి తాగునీటి కొరకు వాటర్ బాటిళ్లను కూడా పంపిణీ చేశారు. ఈ రోజు అన్నదాన కార్యక్రమానికి కరీంనగర్ వాస్తవ్యులు, రిటైర్డ్ అసిస్టెంట్ సబ్ ట్రెజరీ ఆఫీసర్ వొద్నాల నర్సింగరావు – ఉమారాణి దంపతులు తమ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదాతలుగా వ్యవహరించారు. అలాగే, చిరంజీవి తదుక సాయి సిద్ధార్థ పుట్టినరోజును పురస్కరించుకుని అతని పిన్ని, బాబాయ్ అయిన సిరిసిల్ల నివాసితులు మెరుగు స్రవంతి – సతీష్ దంపతులు ఆర్థిక సాయం అందించారు. వీరితో పాటు శాశ్వత దాతలుగా సేవలందిస్తున్న డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు – స్నేహలత దంపతులు, ప్రతాప స్వప్న – సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ – జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ – సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ – బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత కోడళ్లు–కొడుకులు (ప్రజ్ఞ – శరత్చంద్ర, శిరీష – సాయిచంద్ర, శర్వాణి – రవిచంద్ర) మరియు హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు శ్రీహర్ష, సాయి కృష్ణల సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. తమ కుటుంబ సభ్యుల పుట్టినరోజులు, పెళ్లి రోజులు లేదా జ్ఞాపకార్థ దినాల సందర్భంగా పేదలకు ఒక పూట అన్నదానం చేయాలనుకునే దాతలు 92469 39388 ఫోన్ నంబరులో సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ పిలుపునిచ్చారు. ఈ మానవతా కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, సభ్యులు మధు మహేష్, తోట రాజు, ప్రతాపరాజు, సగ్గు రాహుల్, పసుల శ్రీధర్, మఠం శివకుమార్, చింతకుంట భరత్ తదితరులు పాల్గొని స్వయంగా వడ్డన చేశారు.

# రేపే ఓటరు అవగాహన '2కె రన్'

విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపు




**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లలో విస్తృత అవగాహన కల్పించేందుకు గురువారం ఉదయం 7:00 గంటలకు ప్రత్యేక '2కె రన్' నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల చైతన్యం కోసం చేపట్టే ఈ రన్ హనుమకొండ అదాలత్ సర్కిల్‌లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ప్రారంభమై, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు సాగుతుందని కలెక్టర్ వివరించారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్వహించే ఈ అవగాహన రన్‌లో జిల్లా అధికారులు, సిబ్బందితో పాటు విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. అనర్హుల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్

VOICE OF
VANDE BHARATH

బుధవారం, జూన్ 17, 2026

# అభిమాని ఇంటికి ఏపీ డిప్యూటీ సీఎం

- **అరుదైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్‌కు పవన్ కల్యాణ్ పరామర్శ**
- **వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సహాయం**
- **ఉపాధి కోసం క్యాంటిన్ పెట్టిస్తామని తల్లిదండ్రులకు హామీ**
- **వరంగల్ భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రాణాంతకమైన అరుదైన జన్యుపరమైన నరాల వ్యాధితో మంచానికే పరిమితమైన తన కరడుగట్టిన అభిమాని పొనుగంటి నిరంజన్ కోరికను ఆయన నెరవేర్చారు. బుధవారం హనుమకొండలోని హనుమాన్ నగర్‌లో ఉన్న బాలుడి నివాసానికి పవన్ కల్యాణ్ నేరుగా వెళ్లారు. మంచంపై ఉన్న నిరంజన్‌ను ఆప్యాయంగా హత్తుకుని, ముద్దాడి కొద్దిసేపు ముచ్చటించారు. తాను ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ కల్యాణ్ సినిమా పాటలకు వేసిన డాన్స్ వీడియోలను నిరంజన్ చూపించగా.. పవన్ ఎంతో చలించిపోయారు. నిరంజన్ అసాధారణ ధైర్యాన్ని అభినందించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెప్పించిన పట్టువస్త్రం, తీర్థప్రసాదాలను బాలుడికి అందించారు. అనంతరం నిరంజన్ వైద్య ఖర్చుల కోసం రూ. 1 లక్ష తక్షణ ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. సంచలనాల నడుమ సాగిన ఈ ముఖాముఖిలో నిరంజన్ తనకు ఒక కుక్కపిల్ల పెంచుకోవాలని ఉందని పవన్‌కు చెప్పాడు. దీనికి స్పందించిన పవన్.. తప్పకుండా కొని పంపిస్తానని హామీ ఇచ్చారు. అయితే, తాము అద్దె ఇంట్లో ఉంటున్నామని, కుక్కను పెంచుకోవడానికి ఇంటి యజమానుల అనుమతి కావాలని బాలుడి తండ్రి చెప్పడంతో.. పవన్ కల్యాణ్ స్వయంగా ఆ ఇంటి ఓనర్లను అక్కడికి పిలిపించి మాట్లాడి ఒప్పించడం విశేషం. నిరంజన్ తల్లిదండ్రులు గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పనిచేసేవారని తెలుసుకుని, వారి శాశ్వత జీవనోపాధి కోసం ఒక క్యాంటిన్ ఏర్పాటు చేయాల్సిందిగా తెలంగాణ జనసేన నేతలను పవన్ ఆదేశించారు. 'నిరంజన్ ధైర్యం నాకే స్ఫూర్తినిచ్చింది' — అని 'ఎక్స్' లో పవన్ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. తన పర్యటన అనంతరం పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "కొద్ది రోజుల క్రితం హనుమకొండకు చెందిన నిరంజన్ నన్ను కలవాలంటూ పెట్టిన వీడియో చూసి, అతని కోరిక నెరవేర్చాలని ఇక్కడికి వచ్చాను. నేను అతని కోరిక తీర్చడానికి వచ్చానని అనుకున్నాను, కానీ నిరంజన్ చూపిన అసాధారణ మనోధైర్యం, ఆత్మవిశ్వాసమే నాకే ఎంతో స్ఫూర్తినిచ్చాయి. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాల కంటే గొప్పది. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో నువ్వు త్వరగా కోలుకోవాలి" అని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో తన పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీస్ శాఖకు పవన్ కల్యాణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమను జీవితాంతం హృదయంలో దాచుకుంటానని భావోద్వేగానికి లోనయ్యారు. నిరంజన్ నివాసం నుండి బయలుదేరిన పవన్ కల్యాణ్ నేరుగా వరంగల్‌లోని ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పవన్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేదాశీర్వచనం అందించారు. నిరంజన్ త్వరగా కోలుకోవాలని పూజలు చేయించిన అమ్మవారి వెండి ప్రతిమను పవన్ కల్యాణ్ ఆ బాలుడి కుటుంబానికి పంపించారు. ఈ పర్యటనలో ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కే సాగర్ తదితరులు పాల్గొన్నారు. పవన్ రాకతో హనుమకొండలో అభిమానులు, జనసైనికులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఘనస్వాగతం పలికారు.











